క్లుప్తంగా

పేదలకు సీఎంఆర్‌ఎఫ్‌తో మేలు



మురళీశ్రీనివాస్‌కు చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు రూరల్ : సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు ప్రభుత్వ సాయం అందేలా ఎమ్మెల్యే ఆళ్ల నాని కృషి చేస్తున్నారని 15 డివిజన్ కార్పొరేటర్ తంగెళ్ల రాము కొనియాడారు. గురువారం 15 డివిజన్ వడ్డెరగూడెం ప్రాంతానికి చెందిన గుంజే మురళీ శ్రీనివాస్‌కు రూ.1.20 లక్షల చెక్కును నాని చేతులు మీదుగా అందజేశారు.

చదరంగం విజేతలకు ఎమ్మెల్యే అభినందన



చెస్ విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు రూరల్: ఇటీవల భీమవరంలో జరిగిన చెస్ పోటీల విజేతలను ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అభినందించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చిన చిన్నారులు గంజి అనురూప్ మోషే, అబ్రహాం అబ్రహమ్ సాధించిన పతకాలు, సర్టిఫికెట్లను నాని పరిశీలించారు. చిన్నతనంలో అద్భుత ప్రతిభ చాటుతున్న చిన్నారులకు తన వంతు ప్రోత్సాహం అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని 80కు పైగా పతకాలు సాధించి ఏలూరుకు పేరు తెచ్చారని కొనియాడారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆటలపై మక్కువ పెరిగేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అబ్రహాం, గారీ కాస్పారోవ్ డైరెక్టర్‌ను అభినందించారు.

హనుమాన్ చాలీసాపై ఆధ్యాత్మిక ఉపన్యాసం



విష్ణుప్రియను సన్మానిస్తున్న రమేష్ కుమార్ దంపతులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో నగరానికి చెందిన శ్రీ రామకోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 92వ శ్రీ రామకోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విశ్వశాంతి సమాజం సభ్యులచే మౌన ధ్యానం, భక్తి గీతాలాపన, హరే రామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం 5.30 గంటలకు నగరానికి చెందిన వేదాంతం విష్ణుప్రియ హనుమాన్ చాలీసా అనే అంశంపై ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. అనంతరం నగరానికి చెందిన స్వర్ణ నృత్యాలయం ఆధ్వర్యంలో నాట్యాచారిణి కె.స్వర్ణలత శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

నృసింహ మహా యజ్ఞానికి ఏర్పాట్లు పూర్తి

ద్వారకాతిరుమల: సుందరగిరిపై స్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నిర్వహించే రుద్ర సుదర్శన సహిత నృసింహ 30వ మహా యజ్ఞానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా మహా శివరాత్రి నాడు సాయంత్రం మొదలుగా తెల్లవార్లు ఈ యజ్ఞాన్ని వైభవంగా నిర్వహిస్తారు. హైదరాబాద్‌కు చెందిన కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురుజీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ యజ్ఞ క్రతువును యూట్యూబ్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించవచ్చని సీహెచ్ కుటుంబరావు తెలిపారు. గురువారం ఆలయ యాగశాలలో ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.

రావణబ్రహ్మ వాహనంపై ఊరేగిన శివయ్య

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివయ్య కల్యాణోత్సవాల్లో భాగంగా గంగా పార్వతీ సమేత శివదేవుడు శేషవాహనంపై క్షేత్ర పురవీధుల్లో గురువారం రాత్రి అట్టహాసంగా ఊరేగారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి శివకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

వైఎస్సార్ సీపీ పోలవరం పరిశీలకులుగా శ్రీను

బుట్టాయగూడెం: వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులుగా నందెపు శ్రీను నియమితులయ్యారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో శ్రీనును పరిశీలకులుగా నియమించినట్టు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు గురువారం వెలువడ్డాయి.

జగన్ హయాంలోనే మహిళలకు గుర్తింపు

ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఏలూరు (టూటౌన్): కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని,మేయర్ తదితరులు



ఏలూరు(మెట్రో): మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): నామినేటెడ్ పదవులు, స్థానిక సంస్థల్లో మహిళలకు పెద్దపీట వేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక సారథి కల్యాణ మండపంలో మెప్మా ఆధ్వర్యంలో గురువారం మహిళా దినోత్సవ వేడుకలు మేయర్ షేక్ నూర్జహాన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ మహిళా సాధికారత, లింగ సమానత్వం కోసం ప్రపంచ వ్యాప్తంగా మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారత, సుస్థిరత కోసం తమ ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని వివరించారు. మహిళలు అన్ని రంగాల్లోనూ ప్రతిభ చూపుతూ ముందుకెళ్లడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మేయర్ షేక్ నూర్జహాన్‌ను మెప్మా పరిధిలోని సీఓలు, ఆర్పీలు సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు నూకపెయ్యి సుధీర్ బాబు, గుడిదేశి శ్రీనివాస్, సాహిత్యమండలి రాష్ట్ర చైర్మన్ పిళ్లంగోళ్ల శ్రీ లక్ష్మి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మహిళా సాధికారత సాధనే లక్ష్యం

- మహిళా సాధికారత సాధనకోసమే ప్రపంచ వ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు 5వ అదనపు జిల్లా జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తి జి.రాజేశ్వరి అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా జడ్జి రాజేశ్వరికి పుష్పగుచ్ఛం, స్వీట్స్ ఇచ్చి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీవీ రామాంజనేయులు, ఏలూరు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నక్కా నాగరాజు, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రెటరీ టి.సుబ్బారావు, యువ న్యాయవాది రవి ఉన్నారు.
- ప్రభుత్వ వైద్య కళాశాలలో కమ్యూనిటీ మెడిసిన్ డిపార్టుమ్మెంట్ ఆధ్వర్యంలో మహిళా సిబ్బంది, వైద్య విద్యార్థినులకు రొమ్ము కాన్సర్‌లపై, హెచ్‌పీవీ వాక్సినేషన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆగ్నేస్ విజయ, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్/హెచ్‌వోడీ డాక్టర్ గంగాభవాని, ఇతర శాఖల హెచ్‌వోడీ, అసోసియేషన్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, సిబ్బంది పాల్గొన్నారు.



ఏలూరు (టూటౌన్) : జడ్జి, మహిళా కోర్టు న్యాయమూర్తికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న న్యాయవాదులు



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జేసీ లావణ్యవేణిని సత్కరిస్తున్న సీఆర్‌ఆర్ కళాశాల యాజమాన్య ప్రతినిధులు

మహిళా సాధికారతకు విద్యే ప్రధానాస్త్రం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : మహిళా సాధికారతకు విద్యే ప్రధానాస్త్రం అని, ఆ విద్య విలువలతో కూడుకునదై ఉండాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి అన్నారు. స్థానిక సీఆర్ రెడ్డి అటానమస్ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని కళాశాల ఆడియో విజువల్ హాల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లావణ్యవేణి మాట్లాడుతూ మహిళ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఒక మహిళ విద్యావంతురాలైతే మూడు తరాలను విద్యావంతులుగా తీర్చిదిద్దవచ్చని, ప్రస్తుత నినాదం లింగసమానత్వమని వివరించారు. సీఆర్‌ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్‌వీ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్ మాట్లాడారు. ఈ సందర్భంగా లావణ్యవేణిని కళాశాల యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జి.రాము, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ ఎ.లావణ్య, అడిషనల్ కోఆర్డినేటర్ లక్ష్మీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

- ఏలూరు జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక వట్లూరు టీటీడీపీలో రేపటి సుస్థిరత నేటి లింగ సమానత్వం అనే అంశంపై సదస్సు సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు డి.పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. ఏలూరు డీఎల్‌డీఓ లక్ష్మి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి సూర్య చక్రవేణి మాట్లాడారు. మహిళలు, ఆడపిల్లలు సంరక్షణ, మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లింగ సమానత్వం గుర్తించి వివరించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, జిల్లా సమాఖ్య పాలక వర్గ సభ్యులు, జిల్లా సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు, డీఆర్‌డీఏ, వైఎస్ఆర్‌కేపీ సిబ్బంది, జాబ్స్ ట్రైనింగ్ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా భాగస్వామ్యంతోనే అభివృద్ధి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అన్ని రంగాల్లో మహిళల భాగస్వామ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమౌతుందని ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్స్‌పాల్ గుత్తా గిరిబాబు అన్నారు. స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల మహిళా సాధికారత విభాగం, హేళాపురి లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన గిరిబాబు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కేబీ రావు, కళాశాల మహిళా సాధికారత విభాగం కో ఆర్డినేటర్ సీహెచ్ ఉదయలక్ష్మి, కళాశాల అధ్యాపకులు టీవీఎస్ పద్మావతి, పీఆర్ కావ్య శ్రీ, ఎస్ సుశ్యలత మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులకు, విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల మహిళా సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సెక్రటరీ బీవీవీ సత్యనారాయణ, కళాశాల సీపీడీసీ సభ్యుడు ఎల్ వెంకటేశ్వరరావు వివిధ విభాగాల అధ్యాపకులు కె.అజయ్ కుమార్, వి.వెంకట్‌రావు, ఎం రాంబాబు, ఎస్ పరమేశ, ఎం విజయకుమార్, ఎం కృష్ణ చైతన్య, టీవీ దుర్గా ప్రసాద్, ఎన్ కరుణ లత తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం కష్టపడాలి

విద్యార్థినిలు తమ లక్ష్యాలను సాధించడానికి నిరంతరం కష్టపడాలని జిల్లా బాలల సంరక్షణాధికారి సీహెచ్ సూర్యచక్రవేణి సూచించారు. స్థానిక సీఆర్‌ఆర్ మహిళా కళాశాల ఉమెన్ ఎన్‌పవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినత్సోవ కార్యక్రమం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో మహిళలది కీలక భూమిక

ఏలూరు(మెట్రో): మహిళలు మహారాణులని, సమాజ అభివృద్ధిలో మహిళలు కీలక భూమిక పోషిస్తున్నారని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ అన్నారు. డీపీఓ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డీపీఓ దంపతులు శ్రీనివాస విశ్వనాధ్, శైలజ మహిళా ఉద్యోగులను శాలువ కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజశేఖర్, సిబ్బంది కె.సునీత, మల్లికా, జి.విజయ, ఫాతిమా, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, తహెరా, సోములు, పులి సత్యనారాయణ, భాస్కర్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి శైవక్షేత్రాల ముస్తాబు

అభిషేకాలు, దర్శనాలకు ఏర్పాట్లు



పత్తేబాద శివాలయంలో విద్యుత్ దీపాలంకరణ



పత్తేబాద చొడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహాశివరాత్రి ఉత్సవాలకు ఏలూరు నగరంలోని శైవ క్షేత్రాలు ముస్తాబయ్యాయి. స్వామివారి దర్శనం కోసం ప్రత్యేక క్యూలైన్లు, భక్తులకు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసి, నీడ కోసం పందిళ్లు వేశారు. పత్తేబాద చొడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, తైలాభిషేకాలు, సాయంత్రం స్వామి వారి భజన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.48 గంటలకు శివజ్యోతి కార్యక్రమం, 7.02 గంటలకు స్వామి శాంతి కల్యాణం, రాత్రి 10.17 గంటలకు లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేయనున్నారు.

- పవర్‌పేట శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు పంచామృతాలతో, పండ్ల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో మహారుద్రాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 8 నుంచి 12 గంటల వరకు లింగోద్భవ కాలంలో స్వామి వారికి 516 కేజీల పంచదారతో మహా శర్కరాభిషేకం చేస్తారు. రాత్రి 12 గంటలకు 27 హారతులతో స్వామి వారికి విశేష హారతి సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేయనున్నారు.
- దొండపాడు శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక శ్రీ విశ్వేశ్వర స్వామి వారికి అహోరాత్ర మహాశివరాత్రి మహోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 5 గంటలకు గణపతి పూజ, 6 గంటల నుంచి మహన్యాస పారాయణ అనంతరం ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రదోషకాల అభిషేకాలు, లక్ష్మీగణపతి, నవగ్రహ, మృత్యుంజయ సహిత రుద్రహోమాలు, అనంతరం పూర్ణాహుతి నిర్వహిస్తారు. పార్వతీ కల్యాణం, లక్ష బిల్వార్చన , రాత్రి 12 గంటలకు విశేష అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 9 నుంచి తెల్లవారు జాము 4 గంటల వరకూ భజన, దివ్యనామ సంకీర్తన, జాగరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- అగ్రహారంలోని శ్రీ గంగా, వింధ్యవాసినీ సమేత శ్రీ నగరేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారుజాము 4 గంటల నుంచి 10 గంటల వరకూ స్వామి వారికి అభిషేకాలు నిర్వహిస్తారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మూడు గంటల వరకూ తిరిగి అభిషేకాలు అనంతరం అలంకరణ చేస్తారు. రాత్రి 7 గంటలకు స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించి, రాత్రి 10, 12 గంటల వరకు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించనున్నారు. దక్షిణపు వీధిలోని మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి దేవస్థానం, అగ్రహారంలోని అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి దేవస్థానం, ఆదివారపు పేట పర్వతవర్ధని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లోనూ విశేష పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

శివరాత్రి ఉత్సవాల్లో యునాని వైద్య శిబిరం

ఏలూరు (టూటౌన్): శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 8న బలివేలో ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు యునాని ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఏలూరు ప్రభుత్వ యునాని వైద్యాధికారి జి.రఘునాథ్, కొవ్వలి ప్రభుత్వ యునాని వైద్యాధికారి వై.ప్రభుకిరణ్‌లు తెలిపారు. బలివే ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇడా చైర్మన్ బొద్దాని

ఏలూరు (టూటౌన్) : గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బీసీల సంక్షేమం, అభివృద్ధి, ప్రాధాన్యత కల్పించిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని ఏలూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ అన్నారు. స్థానిక అశోక్ నగర్ కంద్రిగగూడెం వద్ద గల కర్ణభక్తుల కల్యాణ మండపంలో ఏలూరు పద్మశాలీ సంఘం, దేవాంగుల సంఘం, కర్ణభక్తుల సంఘం, చేనేత సొసైటీ అధ్యక్షులు కొల్లిపర సురేష్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొద్దాని మాట్లాడుతూ కార్మికుల, బీసీల పక్షపాతి, ప్రజాబంధు ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్‌లను వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గత పాలకులు బీసీలను ఓటు బ్యాంకు రాజకీయాలకే పరిమితం చేశారని, ఇందుకు భిన్నంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం బీసీల పక్షపాతిగా ముద్ర వేసుకుని, వారి అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ నిరంతరం పనిచేస్తున్నారని వివరించారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం

పెదపాడు: అక్క చెల్లెమ్మలకు సొంతింటి కల నెరవేర్చాలన్నదే సీఎం జగనన్న ఆశయమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు గ్రామంలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా పేదలకు ప్రభుత్వం అందించిన రిజిస్ట్రేషన్ ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. పెదపాడు మండలంలో 90 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. మొదటి విడతలో 3082 మందికి లబ్ధి చేకూర్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం 1300మందికి మాత్రమే రిజిస్ట్రేషన్ అయిందని త్వరలో మిగిలిన వారికి రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తరువాత వెంటనే అందిస్తామని చెప్పారు.

కార్యకర్తలకు అండగా ఎమ్మెల్యే నాని



గాయపడిన కార్యకర్తను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నాని

ఏలూరు (టూటౌన్) : పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఇటీవల ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద ఉంటున్న ఏలూరు రెండో డివిజన్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పాలకొండ నాగేశ్వరరావును గురువారం ఎమ్మెల్యే నాని పరామర్శించారు. పూర్తిగా కోలుకునేవరకూ విశ్రాంతి తీసుకోవాలని నాని సూచించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

14న రైతుల చలో ఢిల్లీ

ఏలూరు (టూటౌన్): ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా కేంద్రలోని మోదీ ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశంలో వివిధ రైతు, వ్యవసాయకార్మిక, కౌలు రైతు, కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సమావేశం గురువారం నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు కేంద్ర ప్రభుత్వ రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 14న రైతుల చలో ఢిల్లీ, అదేరోజు జిల్లా, మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు ఈ నెల 9 నుంచి 12 వరకు గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తామన్నారు. నాయకులు కె.శ్రీనివాస్, రాయంకుల లక్ష్మణరావు, బద్దా వెంకట్రావు, బి.జగన్నాథరావు, రెడ్డి శ్రీనివాస డాంగే, దొంతా కృష్ణ, కె.అప్పారావు, నిమ్మగడ్డ నర్సింహా, సాలి రాజశేఖర్, వి.సాయిబాబా, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.